# నూతిలో రూపాయి

నల్లూరి వెంకటేశ్వరరావు

**"పడుతుందా?"** బ్రహ్మన్నో, నోస్ట్రాడమస్‌నో అడుగుతున్నట్టు సముద్రాన్ని అడిగాడు అనంతయ్య.

"పడుతుంది" నిక్కచ్చిగా సమాధానం వచ్చింది.

సమాధానం అనుకూలంగానే ఉన్నా, మనసు మూలలో గబ్బిలంలా పోరాడుతున్న అనుమానం, అవిశ్వాసం "నిజంగానే?" అన్న ప్రశ్నను వేయించాయి.

"నా మాట నమ్మండి వోర్నుగారు!" ఆ పీల మనిషి ప్రాధేయపడుతున్నట్టు అన్నాడు. అంత నమ్మకంగా తను చెప్పిన మాటను వాళ్లు సందేహించటం తన వృత్తిని, శీలాన్ని అవమానించినట్లుగా భావించాడు సముద్రం. హరిశ్చంద్రుడు చెప్పిన మాటను సందేహిస్తే హరిశ్చంద్రుడికెలా ఉంటుందో!

"అంత ధీమాగా ఎలా చెప్పగలవు?" ధర్మరాజు అడిగాడు. అతను అనంతయ్య పేకాట మిత్రుడు. పేకాటలో సదా అనంతయ్య డబ్బు గెలుచుకుని పట్టుకుపోతుంటాడు. అందువల్ల, ధర్మరాజు అనంతయ్యపట్ల స్నేహభావంతో ఉన్నాడంటే అర్థం ఉంది. అనంతయ్య లో ధర్మరాజుపట్ల అదే భావం ఎందుకుంది? ఇది స్టాక్‌హోమ్ సిండ్రోమ్‌ను పోలిన ఒక సిండ్రోమ్ అయివుంటుంది. ప్రస్తుత వ్యవహారంలో అనంతయ్యకు వాదోడుగా వచ్చాడు ధర్మరాజు. పేకాట స్నేహాన్ని మిగతా జీవితానికి విస్తరించగూడదని లేదు. పేకాట కట్టేసినప్పుడల్లా ఆ స్నేహాన్ని క్లబ్బులోనే వదిలేసి ఎవరి ఇళ్లకు వాళ్లు కార్లలో వెళ్లిపోవాలని పేకాట సూత్రాలలో ఎక్కడా లేదు.

"బావులు తవ్వి బతికేవోడికి ఆ ఇసియాలు తెలుస్తాయి వోర్నుగారు. నాతోవచ్చి సుట్టుపక్కల బావులు సూత్తే, ఈ ఏరియాలో నీరు పడుద్దని మీకేనా తెలుసుద్ది. ఇక్కడ సగం బావులు నాను తవ్వినయే. మిగతాయి అడ్డోడు తవ్వినాడు. నాను తవ్వినాటిలో పానకంనాంటి నీరు పడినాది. అడ్డోడు తవ్వినాటిలోనూ నీరు పడినాది. ఆ గంగా పానకమే. యెవరు తవ్వినా ఈడ ఆయమ్మ పడతది - పానకంలా వుండొచ్చు, నేకపోవచ్చు."

వాడికేం వాడు - పానకం పడింది, బావికి చీమలు పట్టాయి అని నమ్మించి ముగ్గులోకి దింపుతాడు. ఆ వృత్తికి అవతలవాడిని నమ్మించగల శక్తి అవసరం. అనంతయ్య తేలికగా లొంగిపోదలచుకోలేదు. ధర్మరాజుని కూడా తోడు తెచ్చుకుని ఉన్నాడు.

"బావి యాతన పడలేమయ్యా. బోరు కొట్టిస్తే ఒక్కరోజులో పని ఒగతెగుతుంది" ధర్మరాజన్నాడు ముఖం చిట్లించి.

"ఆ మామిడిసెట్టు పక్కనే ఇల్లుంది సూడండి! ఆ సొట్టకాలు సొదరి అడ్డోడిమాట కాదని ముందు బోరు కొట్టించినాడు. వారంరోజులు నీరొచ్చి ఆగిపోనాది. తిరిగి ఆడ్నే పిలిపించి బావి తవ్వించినాడు. పానకం నాంటి నీరడ్డంది. పనోల్లంతా దొంగలు, ఆల్ల మాట నమ్మకూడదు అని అనుకోకూడదు. ఆల్లమాట మీద కొంతైనా ఇసివాసం ఉంచాల."

"అంతలా చెబుతున్నావ్, నీరు పడకపోతే మిగతా కూలి తీసుకోకుండా, వేరే కూలి అడగకుండా గొయ్యి కప్పిపెడతావా?" గద్దలా తీక్షణంగా చూస్తూ, చూపుడువేలు ఆడిస్తూ అడిగాడు ధర్మరాజు.

"నీరు పడేదాకా వొగ్గేది నేదు. తవ్వకం పని ఆగదు. ఎపుడు నీరడితే అపుడే గునపం దించేది. గునపం దించినప్పుడే మిగతా డబ్బు అడిగేది. సరేనండోర్నుగారు. నీరడగకపోతే, మీకదే నాయమనిపిస్తే డబ్బియ్యకండి."

"ఏడ్చాడు. వీడి వాచలతా వీడూనూ"



మనసులో అనుకున్నాడు అనంతయ్య.

అంతా రాతిప్రదేశం. 'ఊరికి' దూరంకాదు. ఊరిమధ్యనే కొండవుంది ఇంకా. కొండపక్క ఉంటూ వచ్చిన మామిడితోటకు మాత్రం కాలం చెల్లింది. చెట్లు నరికి పొయ్యిలోకి పంపారు. ఖాళీ అయిన స్థలాలను అమ్ముకున్నారు. నాలుగయిదు కోట్ల రూపాయలు చేతులు మారాయి. పంటమీద ఎంత రాబడి వస్తే లక్షను కళ్లచూడొచ్చు? పొదుగు కోసినా తోటవాళ్లు నష్టపోలేదు. ఎక్కడి నుంచి వస్తోంది కొన్నవాళ్లకు డబ్బు? సంపాదన సక్రమమైనదా, అక్రమమైనదా? అమాయక ప్రశ్న. సంపాదనా రహస్యాన్ని రూపాయి కడుపులో దాచుకుని కాపాడుతుంది. రూపాయి పవిత్రతను, అపవిత్రతను కొలిచే సాధనం లేదు. దాని 'విలువ కొలిచే' మార్గమే గాని, రూపాయి విలువకు కృష్ణపక్షమేగాని, శుక్లపక్షం లేదు. అదిపెట్టి కొన్న భూమి మాత్రం రూపాయి విత్తు నాటినట్లు రూపాయిల వెర్రిపంట పండిస్తుంది. నీరు, ఎరువు, పురుగుమందు, కాపలా అడగకుండా అందుకే కొన్నాడు అనంతయ్య. ఇల్లు కట్టాలా మానాలా అన్న ఆలోచన భవిష్యత్తులో చేయవచ్చు అని గతంలో అనుకున్నాడు (ఎలాగూ రెండిళ్లున్నాయి కాబట్టి). భవిష్యత్తు వర్తమానమయింది. కేవలం రొట్టెతో మనిషి జీవించలేనట్లే, కేవలం పేకాటతో వాడికి కాలం గడవదని తెలుసుకున్నాడు. కాలక్షేపం అవుతుంది, సోమరితనానికి వస్తురూపం ఇచ్చినట్లవుతుంది ఇల్లు కడితే అని ఆలోచించాడు. ఇల్లు కట్టటానికి, కట్టిన ఇంట్లో నివసించటానికి నీరు కావాలి. నీరు నగరపాలక సంస్థ ఇపుడల్లా నీళ్లివ్వదు. కొత్తగా నీటిసరఫరా గొట్టాలు వేసి, నీటి సరఫరా మిగతా ప్రదేశానికి విస్తరించలేదనంత పేదదది ప్రస్తుతం.

'అయితే నిజంగానే నీరు పడుతుందన్నమాట' తనలో తాను అనుకుంటున్నట్లు అన్నాడు అనంతయ్య.

"కొబ్బరి నీల లాంటి నీరు పడుద్ది. సంద్రం మాటకు తిరుగునేదు" సముద్రం పక్కనే నిలుచుని ఉన్నమనిషి గునపాన్ని పిడికిలితో బిగిస్తూ అన్నాడు. నీరు పడకపోతే అతగాడు ఆ గునపాన్ని ఎవరిమీద ప్రయోగిస్తాడో.

"కొబ్బరి నీళ్లంత తీయగా లేకపోయిన ఫర్లేదు. నీరు'పడటం' ముఖ్యం" ధర్మరాజు వ్యంగ్యంగా అన్నాడు.

"సరే. ఎంత కావాలో చెప్పు" అనంతయ్య అడిగాడు.

"వోన్రుగారికి తెలీందేవుంది. యిరవైయ్యేలు" సముద్రం సిగ్గుపడుతూ అన్నాడు. అన్న తర్వాత భయపడ్డాడు. ఆందోళన పడ్డాడు. ఎక్కువ చెప్పి వాళ్లని బెదరకొట్టేశానేమోనని. మరి అంతకు తక్కువడిగితే ఎలాగూ ఇంకా తగ్గించి బేరమాడతారు. ఎలా కిట్టుబాటవుతుంది?

"చాలా దారుణంగా అడిగావు సముద్రం" ధర్మరాజు అన్నాడు చుట్టూ తిరుగుతున్న కందిరీగమీద దృష్టి కేంద్రీకరించి. ఇంత శరీరం వున్నా అది ఒక పురుగుకు లోకువ కదా అని విచారించాడు.

"పదిహేనువేలు నా ఆఖరిమాట" అనంతయ్య అసహనంగా అన్నాడు. ఆ మాటలు అంటున్నప్పుడు అతని కంఠం కంపించింది. అతనికి లంచాలు తీసుకున్న రోజుల్లో కూడా బేరసారాలు ఇష్టముండేది కాదు.

తప్పుడుగాడు పోటీ ఉన్నాడని, పొంచివున్న ఆ బూచిని చూపించీ చూపించకుండా బేరం కుదుర్చుకోవచ్చని అనంతయ్యకు తెలుసు. తనకు తెలుసని సముద్రానికి తెలుసని అనంతయ్యకు తెలుసు. అందుకే ఎందుకో అతని కంఠం కంపించింది.

"కట్టం కళ్లతో సూసిన తర్వాత నేను సెప్పింది దారునమని అయ్యగారు అన్రు. పదేనువేలు తక్కువని వోన్రుగారి మనసుకే తెలుసుద్ది" సముద్రం అన్నాడు.


ఒప్పేసుకున్నాడు రెండు నిమిషాల నిశ్శబ్దంగా గడిచిపోయినాక, ఆకాశం కేసి చూస్తూ సముద్రం బుర్ర గోక్కున్నాక. అంతకుమించి రూపాయి రాలదన్న నిర్ధారణకు వచ్చాడు. వాళ్లు చదువుకున్నవాళ్లు. లోకం చూసినవాళ్లు. తను నూతిలో కప్ప. తను తాత్సారం చేస్తే, గుంటకాడ నక్కలా పొంచివున్న తప్పుడిని చిటికేసి పిలుస్తారు.

అన్ని వివరాలతో ఒప్పందం తర్వాత రాసుకోటానికి నిశ్చయించారు.

కారు నడుపుతున్నాడు అనంతయ్య. గోళ్లు చూసుకుంటూ, కాస్త ఎక్కువగా ఉందనిపించిన దాన్ని కొరుకుతున్నాడు ధర్మరాజు. ఇద్దరూ మాజీ ప్రభుత్వాధికారులు. జీతం కాని డబ్బు వరూధినిలా ఒళ్లో వాలుతుంటే తోసివేసిన ప్రవరాఖ్యులు కాదు. నీరు పల్లమెరుగు, ధనం సంపన్నుల నెరుగు. ఇద్దరి మగపిల్లలు సంపన్న విదేశంలో కరెన్సీలలో కెల్ల రారాజైన డాలర్లను పుష్కలంగా ఆర్జిస్తున్నారు. వాళ్ల తల్లిదండ్రుల మీద గల ప్రేమాభిమానాలని డాలర్లు పంపి వ్యక్తం చేస్తున్నారు.

"పదిహేను వేలన్నాం. దండగ లేదుగదా, ధర్మరాజా?" రోడ్డు మీద కళ్లుంచి అడిగాడు అనంతయ్య.

దండగో కాదో నీకు తెలీదా అనంతయ్యా అని అనంతయ్య అనంతయ్యను అడిగాడు లోలోపల. అతను చుట్టుపక్కల బావుల్లోకి తొంగి చూచివున్నాడు. అవి డెబ్బై, ఎనభై అడుగులలోతు పాతాళలోకానికి తవ్విన సొరంగాలు. అలాంటి లోతులలో మనిషి చేసే పనిని 'శ్రమ' అన్న తేలిక మాటలతో వర్ణించటం పాపం.(అయితే మనం ఎక్కువ పాపాలు, అప్పుడప్పుడు పుణ్యాలు చేయటానికి అలవాటుపడిపోయాం). బతకటానికి అంత ఘాతుకమైన శారీరక కష్టానికి పాల్పడే జీవిని మనిషి అని పిలవచ్చా? అలాంటి 'శ్రమ'కు ఖరీదుకడుతున్న షరాబు తను. అందరూ ఈ వ్యవస్థలో ఏ శ్రమకు, ఏ సేవకు, ఏ వస్తువుకు ఎంత ధర చెల్లిస్తున్నారో అంతకన్నా ఎక్కువ తను ఎలా చెల్లించగలడు? కనీసం బేరం అంతగా తగ్గించి ఆడకుండా, ఇష్టమయితే ఈ ధరకు ఈ పనికి ఒప్పుకో లేకపోతే మానేయ్ అన్న వైఖరి వ్యక్తం చెయ్యకుండా ఉండాల్సింది. చేసినది చాలదన్నట్లు ధర్మరాజుకు అలాంటి ప్రశ్న వేశాడు. తన ద్వంద్వ ప్రవృత్తికి కాస్తవిచారం వేసింది. చికాకు కలిగింది. ధర్మరాజుని ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వనీయకుండా మరో ప్రశ్న అతి త్వరగా ఆలోచించి వేయబోయాడు. కానీ సమాధానం దొర్లిపోయింది. వేసినది యక్షప్రశ్న కాదు కాబట్టి.




"అనంతయ్యా, నిజాన్ని అప్పుడప్పుడన్నా ఒప్పుకోవాలి. లేకపోతే నిజాన్ని ఒప్పుకునే గుణం పూర్తిగా అటకెక్కి, చెదలు తిని చస్తుంది. ఆ బావి తవ్వకపు ఖర్చు రూపాయలలో అనుకుంటే 'అంతా' అనిపిస్తుంది. రూపాయికున్న అసలు విలువ ఎంత? డాలర్లలో ఆ ఖర్చు

మూడువందలు. ఈ పేదదేశంలో శ్రమఖరీదు చౌక," ధర్మరాజు ధర్మరాజు కాకపోయినా అన్నాడు.

ఆంగ్లరాజ్యపు దినాలలో వాళ్ల గురించి వాళ్లు కట్టుకుని, వాడుకుని, పోతూపోతూ వదిలేసిపోయిన రాతి కట్టడం ఆ క్లబ్బు. ఆవరణలో కారు ఆపి, దిగి చకచక పోర్టికో మెట్లెక్కి, వరండాలోకి అడుగుపెట్టాడు. విశాలమైన వరండాలో పాలిష్ పెట్టిన రోజ్‌వుడ్ గుండ్రటిబల్లచుట్టు కూర్చున్న మరో ముగ్గురితో ఈ ఇద్దరూ చేరారు. అతి దగ్గరగా, నీలంగా పరుచుకున్న అనంతమైన సముద్రం. హోరు పెడుతోంది. సముద్రం వేపు పేకముక్కల మీది నుంచి చూశాడు అనంతయ్య ఒకక్షణం. సముద్రపు ఒడ్డున కాక సముద్రపు నడుమ ఏదో ద్వీపంలో ఉన్నట్లనిపించింది. మరుక్షణం ఆ హోరును పట్టించుకోకుండా పేకాటలో నిమగ్నమయ్యాడు. విలువలేని రూపాయలను గెలుచుకుంటూ, ఓడిపోతూవున్నారు పేకాటలో.

000

జలయజ్ఞానికి సముద్రంతో కలిసి తొమ్మిదిమంది రుత్విక్కులు. నేతికి బదులు చెమట పారుతుంది. కంఠస్వరానికి బదులు కండబలానికి పరీక్ష. మొదటిరోజు అయిదొందలు అడ్వాన్సుగా తీసుకుని మహాప్రసాదంలా కళ్లకద్దుకున్నాడు సముద్రం. పని ఆరంభంలో చేసిన పూజలో పగిలిన కొబ్బరికాయలనీరు నేలలో ఇంకింది.

తర్వాత రెండురోజులు వేరే పనుల కారణంగా అనంతయ్య స్థలం వేపు వెళ్లలేదు. నాలుగోరోజు ఇంటిదగ్గర పెందలాడే బయలుదేరాడు. స్థలాన్ని చూసి వేళకు క్లబ్బుకు చేరటానికి. వేళకు కట్టుబడి వుండటం ఉద్యోగ దినాలనాటి నుంచి కొనసాగుతున్న అలవాటు.

కారులో నుంచి చూస్తుంటే దగ్గరవుతున్న పనివాళ్లు కనిపిస్తున్నారు. ఒకచేత్తో శరీరానికి దగ్గరగా తాడు పట్టుకుని, రెండోచేత్తో అదేతాడును రెండడుగుల అవతల పట్టుకుని, కాళ్లు నేలకు తన్నిపెట్టి, పళ్లు బిగించి లాగుతున్నారు. వాళ్లంతా వివిధ భంగిమలలోని తోలుబొమ్మలలా ఉన్నారు. ఇద్దరు పురుషులు, ఇద్దరు పదహారుపదిహేడు వయసు కుర్రాళ్లు, ఇద్దరు ఆడవాళ్లు -- మానవహారంలా ఉన్నారు. సింహాద్రి బావి అంచున నిలబడి తట్టను అందుకుంటున్నాడు.

కారు దిగాడు. సముద్రం కనబడలేదు.

"సముద్రమేడి?" అనంతయ్య అడిగాడు.

"ఉన్నాడు" అంది సీతమ్మ తను చూడకపోయినా దేవుడున్నాడని చెప్పే ఆస్తికురాలిలా.

ఆమె నల్లరాతి విగ్రహంలా, గ్రామదేవత నూకాలమ్మలా వుంది. చీర మోకాళ్లదాకా మడిచి కట్టింది. అరిగిపోయిన మట్టెలున్నాయి కాలివేళ్లకి. ఆమె స్వరం కంచులా, మొరటుగా మ్రోగింది క్షణం. తర్వాత, చెదరిన నిశ్శబ్దం పోగయ్యింది. స్త్రీ మృదుత్వం, కోమలస్వరం సంఘర్షణలో కాలక్రమేణా శిథిలమై ఉంటాయి. ఆమె కళ్లకు కాటుక, నుదుట ఎర్రటి బొట్టు ఉన్నాయి.

ఆమె సమాధానం విని చుట్టూ చూశాడు సముద్రం గురించి. తన కళ్లే తనను మోసం చేస్తుండవచ్చు. సాటి మనుషులనేకాదు, సొంత శరీరభాగాలనూ నమ్మకూడని రోజులు.

"బావిలోకి దిగినాడు మా సంద్రం మావ" పైడమ్మ అంది. ఆమె కాటుక, బొట్టు పెట్టుకోలేదు. మెట్టెలూ లేవు.

"ఎందుకు?"

సీతమ్మ నవ్వింది నిశ్శబ్దంగా. అనంతయ్యకు అర్థమయింది. బావిలోకి సముద్రం ఎందుకు దిగుతాడు? ఆలోచించకుండా "ఎందుకు?" అన్నా, అలా అనటానికి కారణం లేకపోలేదు. ఆ వయసులో బావిలోకి దిగి, కృశించిన శరీరంతో పని చేయగలడని అనిపించకపోవటం వలన.

తాడు ద్వారా బావిలోనుంచి సంకేతం వచ్చినట్లుంది. పని తిరిగి మొదలయ్యింది. ఇంటి స్థలాలలోకి రాకపోవడం వలన బతికిపోయిన మామిడిచెట్టు దాకా తాడు లాగి ఆగిపోయారు. రమారమి పదిహేను అడుగుల స్థలం తవ్వారన్నమాట. తట్టను గిలక దగ్గర అందుకుని, ఉమ్ముతూ మట్టిని దూరంగా పోశాడు సింహాద్రి. ఆ తట్టలో మట్టి కన్నా పగిలిన, పగలని రాళ్లే ఎక్కువేమో. అలాంటి నేలలో నీళ్లుంటాయిని ఎలా నమ్మటం? నీరంటూ పడిన తర్వాత ఏ రాళ్లలో ఏ నీరుందో ఎవరికెరుక' అనుకోవాలి.

అనంతయ్య బావి దగ్గరగా వెళ్లాడు. భూమిని యంత్రాలలా తొలుస్తున్న రెండు జీవాల ఒంటిమీద చొక్కాలు లేవు. ఆ ఇరుకు ప్రదేశంలో వేడికి ఉడుకుతూ సముద్రం గునపంతో తవ్వుతున్నాడు. అప్పలస్వామి పారతో మట్టిని తట్టలోకి లాగుతున్నాడు

ఒకరినొకరు తిట్టుకోవడం, ఆటలు పట్టించుకోవటం, పాటలు పాడటం, సినిమా కబుర్లు చెప్పుకోవడం యాంత్రికమైన పనిలో మునిగిన వాళ్లకు 'మనం మనుషులం' అని గుర్తుకు తెస్తుంటాయి.

కారువైపు నడవటం మొదలుపెట్టాడు. వెళ్లిపోవటానికి, సింహాద్రి నసుగుతూ వెనకరావటం గమనించాడు. నవ్వుకుంటూ ఆగాడు. అతనికి ఏం కావాలో తెలుసు. వాళ్లు అడక్కుండా తనెందుకు ఇవ్వటం?



"డబ్బులు కావాలని సంద్రం అడగమన్నాడు"


"డబ్బులు అక్కరలేనిదెవరికి?"

వ్యాలెట్ తెరిచాడు. స్టేప్లర్ పిన్ను తీసి వుంచిన వందల కట్ట బయటికి లాగాడు. సింహాద్రి కళ్లు పెద్దవి చేసి చూస్తున్నాడు వింతగా. చూస్తుంటేనే ఆ విలువైన కాగితాలు తనివి తీరుస్తున్నాయి. అయిదునోట్లు విడిపించి వాడికి ఇస్తూ "అయిదు" అన్నాడు. వాడివి మట్టి చేతులు. అవి కొత్త నోట్లు తటపాయించాడు సింహాద్రి. చేతులు నెత్తికి కట్టిన తువ్వాలుకు తుడుచుకున్నాడు. నోట్లు అందుకోలేదు. "ఏడొందలగడమన్నాడు సంద్రం" అన్నాడు. సముద్రం నిజంగా అడగమన్నాడో ఇతగాడు సొంత తెలివితేటలు ఉపయోగిస్తున్నాడో నోట్ల కట్ట కంటపడగానే. పేకాట డబ్బులోంచి మరో రెండు నోట్లు ఇచ్చాడు అనంతయ్య. అతనేం దానం చెయ్యడం లేదు. జాలి కావలిస్తే ఎంతైనా పడొచ్చు, దానాలు చెయ్యడమే కష్టం. ఇచ్చిన ప్రతి రూపాయికూ లెక్క చూస్తాడు. అలా లెక్క చూడటంలో ఆనందంకూడా వుంది. అవసరమే కాక, శ్రామికులంటే జాలి వున్నంత మాత్రాన డబ్బు లెక్క చూడకూడదని లేదు, అలా లెక్కలు చూచినంత మాత్రాన వాళ్లంటే జాలి లేదని కాదు.

కారు దుమ్ము రేపుతూ పోయింది. కలలోలా మాయమయింది. కారు మీదినుంచి చేతిలోని నోట్ల మీదికి కళ్లు మళ్లించాడు సింహాద్రి.

ముప్పైఅయిదు డిగ్రీల ఎండ వేడిమి, బద్ధకం అనంతయ్యను మూడురోజులపాటు స్థలం వైపు రానియ్యలేదు. సరాసరి క్లబ్బుకే వెళ్లి ఇల్లు చేరేవాడు. నాలుగోరోజు స్థలానికి వచ్చాడు. ఈసారి సముద్రం లాగుతూ కనిపించాడు. లాగుతూ, పళ్లు బిగించి మిగతా వాళ్లను తిడుతున్నాడు.

స్థలానికి దక్షిణంగా నాలుగడుగులు వేసి నిలబడ్డాడు అనంతయ్య. పక్కనే నరికేసిన మామిడిచెట్టు మొదలుంది. కర్కశ అనుభవాన్ని మరిచిపోయి ఎర్రటి చిగుళ్లు వేసి బతికితే ప్రయత్నంలో ఉంది చెట్టు. బాధగా బావిగిలక కీచుమంటోంది ధ్వంసమవుతున్న బాల్యానికి స్వరం అరువిస్తున్నట్టు. నాగరికత అంటే ఒక అర్థం స్ఫురిస్తోంది. చెట్టు అడ్డువస్తే నరికెయ్యడం, భూమిలోకి సొరంగం తవ్వెయ్యడం, నేలను కాంక్రీటు కర్కశంతో నింపెయ్యడం. గొడ్డును మరిపించే శారీరక శ్రమ మీద ఆధారపడితేనే గాని ముద్ద సంపాయించుకునే వీలు లేక పోవటం




కూడా నాగరికత లక్షణం అయివుంటుంది.

పావుగంట తర్వాత పని కట్టేసి అనంతయ్య దగ్గరికి వచ్చాడు సముద్రం. ఏదో చెప్పటానికి తటపాయిస్తున్నాడు. విషయం ఏమిటన్నట్లు కళ్లు ఎగరవేశాడు అనంతయ్య.

"బావిలో రాయి తగిలినది"

"రాయి బద్దలు కొట్టొచ్చుగా"

"కొట్టొచ్చు. గునపాలతో అవదు. మందుతో అవుద్ది"

"ఎక్కడ దొరుకుతుంది?"

"ఆ బాద మీకెందుకు? నాకొదిలెయ్యండి. డబ్బియ్యండి. రాత్తిరికి కొనుక్కొచ్చి పొద్దునే యడతా."

"రాయి ఏమేరకు ఉందో ఏం చెప్పగలం? మందు పెట్టి పేల్చి లోపలికి వెళ్లలేనంతగా వ్యాపించి వుంటే ఇంతే సంగతులు. నీరు పడుతుంది పడుతుందని దింపావు."

"ఓన్రుగారు ఇలా రాయి తగలటం మామూలే. బెంబేలడాల్సిన ఇసయం కాదు. నమ్మించి మోసం చేసే మనిసిని కాను. మాయమీద బతకగల్గినోన్నయితే కట్టాన్ని ఎందుకు ఎంచుకుంటాను?"

"ఎంత కావాలి?"

"ఏడొందలియ్యండి."

"మందుకే ఏడొందలా?"

"కూలితో కలుపుకుని. మీరు డబ్బిచ్చి నాల్రోజులైపోనాది"

అనంతయ్యకు ఆ విషయం తెలుసు. బావిదగ్గరకెళ్లి లోపలికి చూశాడు.

"మూడురోజుల నాటికి, నేటికి తేడా కనబడటం లేదు" పెదవి విరిచాడు.

ముందు పదిహేను, ఇరవై అడుగుల లోతుపని త్వరగానే సాగుతుందని, పోనుపోను ప్రతి అడుగులోతు తవ్వటం కష్టంతో కూడుకున్నపనని అనంతయ్య అర్థం చేసుకోగలడు.

"పైనుంచి సూస్తే అలాగే అగుపడతాది వోన్రుగారు. లోతు కొలిస్తే తెలుస్తది ఏరోజుకు ఎంత తవ్వినామో. యండాకాలం ఇది. బూవిమీదనే ఉండనేక పోతన్నాం. బూవి కడుపులో పని. సురుగ్గా సాగమంటే సాగదు, కట్టమే మిగులుద్ది. ఆకలికి కాలాల్తో పని లేదు. ఏకాలంలోనైనా అది పనిసెయ్యనీకుండా ఉంచదు. లోనకి దిగిం తర్వాత ఏడిమాట అటుంచి ఇసవాయువు తగిలిందా ఉక్కిరిబిక్కిరి సేసి సంపుద్ది. బూవిమీద బతకటానికి పాతాలలోకంలో పని సెయ్యాల. పొయిన యండాకాలంలోనే బావి బలితీసుకుంది నా కొడుకుని. అల్లా ఎర్రరయిక ఆడమనిసే ఆడిపెల్లం. ఆ నల్లగుంటడు ఆడి కొడుకు."

ఆ పనిలో కష్టాలు, ప్రమాదాలు అతి చేరువలో ఉన్నాయని తెలిసీ దానిమీద ఆధారపడి జీవిస్తూ వాటిగురించి ఎందుకు ఏకరవు పెడతాడు? కావాలని, ఇష్టపడి అలాంటి వృత్తిని ఎవరూ చేపట్టరు - తప్పనిసరి అయి, అంతే. న్యాయంగా, అడగకుండా చేతికి రావలసిన కూలి అడగవలసి వస్తుంది. అలా అడుగుతున్నప్పుడు పడిన శ్రమను కళ్లకు కట్టినట్లు వర్ణించవలసిన అవసరం ఉంది. ఆ విషయం సముద్రానికి, అనంతయ్యకి తెలుసు.

వందల కట్టలోనుంచి ఏడు లెక్కపెడుతున్నాడు అనంతయ్య. పెళపెళలాడుతున్నాయి అవి. ఎనిమిది అడిగినా (ముందు మొరాయించి) ఇచ్చివుండేవాడు. ఎప్పటికైనా వాళ్లకు ముట్టవలసిన మొత్తంలోనే అది. పని చేయించుకునే ఆసాములు పనివాళ్లు అడిగినంతా ఇచ్చెయ్యరు. వాళ్ల మీద నమ్మకం ఉండదు కాబట్టి వాళ్లు చేసిన పని మేరకు అందవలసిన కూలితో కొంత తొక్కిపెడతారు. ఆకురాయి లాంటి చేతులు రెండిటితో, దానం పుచ్చుకుంటున్నట్లు వినయంగా, కృతజ్ఞత కనబరుస్తూ అందుకున్నాడు నోట్లు సముద్రం.

రోజులు పరుగు తీస్తున్నాయి అవతల కొంపమునుగుతున్నట్లు. రాయి పడిందని పేలుడు మందుకు మొత్తం మూడుసార్లు డబ్బు అడిగి తీసుకున్నాడు సముద్రం. తనతో అతను నిజాయితీగా ప్రవర్తిస్తున్నాడా అన్న అనుమానం వచ్చింది అనంతయ్యకు ఒకసారి. లేదని ఎలా రుజువు చెయ్యడం? అంత కష్టమైన పని చేసి బతుకుతున్న కూలీ నిజాయతీగా ఉండాలని కోరుకోటం సబబేనా?

"చీటికి మాటికి రాయి పడిందని ముందుకు డబ్బులగడటం నాకు నచ్చలేదు సముద్రం" అనకుండా ఉండలేకపోయాడు. అన్నతర్వాత వెనక్కు తిరిగి దూరంగా కనిపిస్తున్న (ఇక్కడికి ఘోష వినిపించని) నీలి సముద్రాన్ని చూస్తూ నిలబడ్డాడు అనంతయ్య.

"రేప్పొద్దున వచ్చెయ్యండోగ్రుగారు. కొనుక్కొచ్చే ముందు చూపిస్తా, మీరు చూస్తుండగా ముందు పెట్టి రాయి బద్దలు కొడతా" శాంతంగా, సహనంగా అన్నాడు సముద్రం.

ముందు పెట్టి పేల్చి పైకి తెచ్చి కుప్పగా పోసిన పెరుగుతున్న రాళ్ల గుట్టలను చూస్తూ మారు మాట్లాడ లేదు అనంతయ్య. సముద్రం సంఘర్షణ నూతిలోనే కాక నూతి పైన కూడా బేరం నాటి నుంచి సాగుతోంది.

"తీసుకుంటున్న డబ్బు కూలీలకు పంచటానికే సరిపోతుంది. నాకు మిగిలేది నాను చేసిన పనికి రావాల్సిన కూలిడబ్బు. అంతే - పేరుకు మేస్త్రీ అయినా" అన్నాడు ఒకరోజున పాడికళ్లతో.

"పడే కష్టానికి తిండి కావాల. ఆ తిండికే మీ దగ్గర తీసుకునే డబ్బు సరిపోద్ది, అయ్యగారు" అన్నాడు మరోరోజు కమ్యూనిజం అధ్యయనం చేసి ఉండకపోయినా.

"బతకాలంటే రోజూ సవ్వటాకి సిద్దపడాల" అన్నాడు ఇంకొకసారి వైరాగ్యంగా. అతనికి మెట్టవేదాంతం కూడా తెలీదు.


కొవ్వురాళ్ల గుట్టలు, మట్టిదిబ్బలు పెరిగిపోతున్నాయి. (వీటినా భూమి తనలో అంత భద్రంగా దాచుకుంది?) నేల, వాళ్లపట్ల కఠినంగా ఉందా, వాళ్లే దానిపట్ల కఠినంగా ఉన్నారా?

000

ఆరోజు, పేకాటలో అయిదువేలు పోయి మనసు చివుక్కుమంది. తనకున్న పేకాట వ్యసనంలో డబ్బులు ఎప్పుడూ పోగొట్టుకునే అంతర్వ్యసనం కూడా తనకుంది అనుకుని అనంతయ్య వ్యంగ్యంగా నవ్వుకున్నాడు. అతను క్లబ్బు మెట్లు దిగుతుంటే మెట్లు అప్పటికే దిగిపోయిన ధర్మరాజు నిలబడి ఎదురుచూస్తున్నాడు. అతని చంకలో కడుపుతో వున్న చిన్న జంతువులాంటి తోలుసంచి ఉంది.

భుజం మీద ఆప్యాయంగా చేయి వేశాడు ధర్మరాజు.

"అనంతయ్యా, ఈరోజు గత ఆరునెలలుగా




లేనంత రూపాయి విలువ పతనం..."

అప్పటికే కారు దగ్గరకి చేరివుండటంతో అతని మాటలు తుంచేస్తూ,

"స్థలం దగ్గరికి వెళ్లాలి ధర్మరాజు, వస్తా. రేపు తీరిగ్గా మాట్లాడుకుందాం. ఖాళీ సంచీతో క్లబ్బుకు వేళకు వచ్చేయి" అన్నాడు.

సంచీని చంకలోనుంచి తీసి, చేత్తో పట్టుకుని నవ్వాడు ధర్మరాజు. అనంతయ్య బాధను అర్థం చేసుకోగలడు.

కారు బయలుదేరింది. స్థలానికి వెళ్లటమూ ఒక వ్యసనంలా ఉంది. రేవటికల్లా నీరు తగలకపోతే పని ఆపించెయ్యాదలచుకున్నాడు. పేకాటలో డబ్బు పోయిందని సమాధానపడవచ్చు. స్థలం అమ్మకానికి పెట్టెయ్యొచ్చు. ఆ సొరంగంలో పసివాడు ప్రాణం కోల్పోయే ప్రమాదం పొంచి వుంది. జీవితంలో తను తీసుకున్న తప్పుడు నిర్ణయాలలో బావి తవ్వించటం కూడా ఒకటి.

కారు దిగి నాలుగడుగులు వేసి ఆగిపోయాడు. పనివాళ్లంతా ఎందుకని గుమ్మికూడారు? రోజుకంటే ముందుగా పని కట్టేశారా? వాళ్లల్లో సముద్రం కనబడటం లేదు. ప్రమాదం...

"ఎంత సేపయింది పని కట్టేసి?"

"అరగంటయినాది"

"ఏం ఇంకా ఉండిపోయారు? డబ్బు గురించా?"

"సంద్రం గురించి వోనరుగారు"

"ఎక్కడికెళ్లాడు?"

"బావిలో ఉన్నాడు"

"ఒక్కడూ తవ్వుతున్నాడా?"

"ఒక్కడూ ఏం తవ్వుతాడోగ్రుగారు?"

"మరి నిద్రపోతున్నాడా?" కాస్త అసహనంగా, కోపంగా అన్నాడు.

"రూపాయి బిళ్ల నెతుకుతుండు"

"నీటి మాట అటుంచి బావుల్లో రూపాయిలు దొరుకుతున్నాయయా?"

"అలాగయితే వోగ్రుగార్ని కూలిడబ్బులు ఏరే అడగటమెందుకు? ఆడి బనీను జోబులోంచి రూపాయిబిల్ల బావిలోకి పడిపోయింది తొవ్వుతుంటే. అరగంట నుంచి ఎతుకుతున్నాడు. వొచ్చెయరా దొరకదంటే ఇన్లా... మేం పని కట్టేసినాం. 'రూపాయి ఇలువ మీకు తెలీదు యదవల్లారా' అని తిట్టినాడు. మాకు తెలీదా? ఆడొక్కడికే తెలుసా. దొరకని దానికి ఎతికెతికి సస్తమా?"

నలుగురు మనుషులెల్లి కేకలేసి సముద్రాన్ని లోపలినుంచి మొత్తంమీద లాగారు. నలిగిపోయిన రూపాయిలా, కొత్తడాలరు నోటులాంటి అనంతయ్య దగ్గరికి నడిచివస్తున్నాడు. ఒళ్లంతా తడిసివుంది. చెమటా?

"రూపాయి దొరికిందా?"

"సెమటోడ్చి సంపాయించిన రూపాయి నీటి పాలయిపోనాది. ఇంకేం దొరుకుద్ది?"

రూపాయి అసలు విలువ ఎలా నిర్ణయించాలో అర్థమయింది అనంతయ్యకి.

"అయితే, మొత్తం మీద నీరు పడిందన్నమాట"

తల ఊపాడు. సముద్రం గర్వంగా, నీరసంగా ఉన్నా.

. "పానకంలా ఉందా లేదా?" సీరియస్‌గా అడిగాడు.

ఉందన్నట్లు తిరిగి తలఊపాడు. సముద్రం మాట్లాడలేక. పెద్ద బండరాతిమీద అక్కడే, అనంతయ్య ముందు కూర్చుంటూ. తవ్విపోసిన మట్టి, రాళ్ల కుప్పలను సముద్రాన్ని మార్చి చూశాడు అనంతయ్య.

పేకాటలో పోగా మిగిలిన నోట్లను వ్యాలెట్ నుంచి తీసి చేత్తో పెట్టుకుని, చేయి చాచి అన్నాడు అనంతయ్య.

"సముద్రం అందరూ పంచుకోండి. ఇది లెక్కలోకి రాదులే"

అంతలోతుకెళితేనే గాని నీరు తగల్లేదు.

"ఇది తీసుకుని రాత్రికి మళ్లీ బావిలోకి దిగి రూపాయి గురించి వెతక్కు" అనంతయ్య అన్నాడు.

బావి దగ్గరికి నడుస్తూ, "చీకటి పడుతోంది. అంతలోతున వున్న నీరు కనిపిస్తుందా?" అనుకున్నాడు.

■